క్లుప్తంగా

వైభవంగా గంధాభిషేకం



నందీశ్వరుడికి అభిషేకం చేస్తున్న పండితులు, అర్చకులు

మహానంది: మహానందిలో కొలువైన నందీశ్వరస్వామికి మంగళవారం అభిషేకార్చనలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ నల్ల కాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ఆలయ ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జున శర్మ, వేదపండితులు ముందుగా నందీశ్వరస్వామికి పాలాభిషేకం, గంధాభిషేకం, సుగంధ ద్రవ్యాలతో పూజలు చేశారు. అనంతరం నందీశ్వరుడిని అలంకరించి మహా మంగళ హారతులు, నివేదన సమర్పణ చేశారు.

విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు



ఇస్కాలలో సచివాలయ సిబ్బంది హాజరును పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాములపాడు: ఎవరైనా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖా పరమైన చర్యలు తప్పవని ఎంపీడీఓ చంద్రశేఖర్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని రుద్రవరం, తుమ్మలూరు గ్రామాల్లోని గ్రామ సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరుపట్టీని పరిశీలించారు. విధిగా సమయ వేళలు పాటించాలని సూచించారు. గ్రామంలో ప్రజల నుంచి వచ్చే సమస్యలు ఎప్పటికప్పుడు మండల అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి ఉన్నారు.

ఘనవ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రం తనిఖీ

మిడుతూరు: మండల పరిధిలోని అలగనూరు గ్రామంలో ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రాన్ని ఈఓఆర్డీ సంజన్న మంగళవారం తనిఖీ చేశారు. ప్రతి శుక్రవారం ట్యాంకులను శుభ్రపరచి క్లోరినేషన్ చేయాలని, ట్యాంకుల వద్ద శుభ్రపరచిన తేదీలు కనబరచాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అన ంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనురాధ, సిబ్బంది పాల్గొన్నారు.

అకౌంట్‌కు ఆధార్ అనుసంధానం తప్పనిసరి



మాట్లాడుతున్న ఎంపీడీఓ దశరథరామయ్య

మిడుతూరు: మండల ప్రజలు తప్పనిసరిగా తమ బ్యాంకు అకౌంట్‌ను ఆధార్ కార్డుతో అనుసంధానం చేసుకోవాలని ఎంపీడీఓ దశరథరామయ్య అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో 3,914 మంది బ్యాంకు అకౌంట్‌కు ఆధార్ కార్డుతో అనుసంధానం జరగడం లేదని .. వారి వివరాలు సచివాలయ సిబ్బంది ఫోన్ ద్వారా లేదా వ్యక్తి గతంగా తెలియజేస్తారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల బెడద నుంచి కాపాడండి

ఆత్మకూరు: కుక్కల బెడద నుంచి తమను కాపాడాలని స్థానిక కుబ్రా మసీదు ఏరియాకు చెందిన చాంద్‌బాషా, రఫీ, ఇంతియాజ్, మన్సూర్, ముర్తుజావలి, షేక్షావలి, మౌలాలి, షఫీ మంగళవారం మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు రషీద్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ తమ కాలనీలో దాదాపు 50 కుక్కల దాకా సంచరిస్తున్నాయన్నారు. తరచూ చిన్నారులు, కాలనీ వాసులపై దాడులు చేసి గాయపరుస్తున్నాయన్నారు. కుక్కలను ఇతర ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

డిసెంబర్‌లో సీపీఎం జిల్లా మహాసభలు

పాములపాడు: డిసెంబర్ 9,10 తేదీల్లో సీపీఎం జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందికొట్కూరు లో నిర్వహించే జిల్లా మహాసభలకు పార్టీ సభ్యులందరూ హాజరుకావాలని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కావాలంటే పోరాటమే మార్గమని పేర్కొన్నారు. మండల కమిటీలు స్థానిక సమస్యలను తెలుసుకోవాలని చెప్పారు. కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఎండగట్టాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏసురత్నం, మండల కార్యదర్శి స్వామన్న, రైతు సంఘం నాయకుడు వెంకటేశ్వరరావు, మండల కమిటీ నాయకులు బాలయ్య, రాజు, రమణ, వెంకటేశ్వర్లు, ఏసేపు, రమణమ్మ, అంజలి తదితరులు పాల్గొన్నారు.

విస్తారంగా మినుము సాగు

- ఫైరును చూసి మురిసిపోతున్న రైతులు
- అధిక వర్షాలతో తగ్గిన మొక్కజొన్న



రైతులు సాగు చేసిన మినుము పైరు

ఆత్మకూరు: ఈ ఏడాది రబీ సీజన్‌లో రైతులు అత్యధికంగా మినుము పంటను సాగు చేశారు. డివిజన్ పరిధిలోని ఆత్మకూరు, వెలుగోడు, కొత్తపల్లి, పాములపాడు మండలాల్లో ఈ పంటను మరింత ఎక్కువ మంది రైతులు సాగు చేశారు. ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా కురవడంతో ఖరీఫ్ పంట పూర్తయిన వెంటనే మినుము పంట వేసేందుకు రైతులు పెద్ద ఎత్తున ఆసక్తి చూపారు. సిద్దాపురం చెరువుతోపాటు వివిధ గ్రామాల చెరువుల కింద తెలుగుగంగ, కేసీ కెనాల్ ఆయకట్టు పరిధిలోని ఆత్మకూరు మండలంలో 600 హెక్టార్లు, వెలుగోడు మండలంలో 200 హెక్టార్లు, పాములపాడు మండలంలో 400 హెక్టార్లు, కొత్తపల్లి మండలంలో 300 హెక్టార్లు మినుము పంటను రైతులు సాగు చేశారు. నంద్యాల డివిజన్ పరిధిలోని మహానంది, బండిఆత్మకూరు మండలాల్లో ఈ పంట కొంత తక్కువగా సాగు చేశారు. ప్రస్తుతం క్రిమి సంహారక, రసాయన మందులను ఉపయోగిస్తూ రైతులు పంటను కాపాడుకుంటున్నారు.

తగ్గిన మొక్కజొన్న

రబీలో కూడా రైతులు ఈ ప్రాంతంలో మొక్కజొన్న పంటను విస్తారంగా సాగు చేసేవారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో భారీ వర్షాలు కురవడం, ఎప్పుడు పడితే అప్పుడు అధికవర్షాలు కురవడంతో మొక్కజొన్న పంటను రైతులు సాగు చేశారు. కాగా పంటకు కత్తెర పురుగు వ్యాపించడంతోపాటు వర్షాలకు పూర్తిగా ధ్వంసం కావడంతో రైతులు వేసిన పంటకు తగిన పెట్టుబడి కూడా రాకపోవడంతో మొక్కజొన్న సాగుపై ఆశలు వదులుకుని మినుము పంట వైపు మొగ్గు చూపారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వచ్చే మినుము పంటను రైతులు సాగు చేశారు.

మినుము క్వింటాల్ రూ.7,500

మార్కెట్‌లో మినుములకు ధర అధికంగా ఉండడంతో రైతులు సంబరపడుతున్నారు. ప్రస్తుతం క్వింటాల్ రూ.7,500 నుంచి దాదాపు రూ.9 వేల వరకు ధర పలుకుతుండటంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ముందుగా సాగు చేసిన కొందరు రైతులకు దిగుబడులు వస్తుండటంతో పొలాల్లోనే విక్రయిస్తున్నారు. మిగతా రైతులు ఈ ఏడాది మినుము తమ కష్టలను గట్టెక్కిస్తుందనే ఆశతో ఉన్నారు.

మెనూ పాటించకపోతే తొలగిస్తాం



మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న త్రీ మెన్ కమిటీ సభ్యులు

పగిడ్యాల: ప్రభుత్వ పాఠశాలల్లో అమలయ్యే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకంలో మెనూ పాటించకపోతే వంట ఏజెన్సీ నిర్వాహకులను తొలగిస్తామని త్రీ మెన్ కమిటీ సభ్యులు హెచ్చరించారు. మంగళవారం మండలంలోని లక్ష్మాపురం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని త్రీ మెన్ కమిటీ సభ్యులైన ఎంపీడీఓ సుమిత్రమ్మ, తహసీల్దార్ శివరాముడు, ఎంఈఓ సుభాన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలకు రుచికర పోషకాహారాన్ని తయారు చేసి వడ్డించాలన్నారు. మెనూ సక్రమంగా అమలు చేయించే బాధ్యత పాఠశాల ప్రధానోపాధ్యాయులదేనని మెనూ లోపిస్తే వారిపై చర్యలకు వెనుకాడమని హెచ్చరించారు. అనంతరం ఎంఈఓ సుభాన్ రికార్డులను పరిశీలించారు.

లిఫ్టుల ద్వారా సాగు నీరు ఇవ్వాలి

కొత్తపల్లి: మండలంలోని లిఫ్టుల ద్వారా ప్రతి ఎకరాకు సాగునీరు ఇవ్వాలని, సీపీఎం నాయకులు స్వాములు, సీపీఐ మండల కార్యదర్శి వెంకటశివుడు, నీటిముంపు నిరుద్యోగుల సంఘం నాయకుడు బొల్లు ప్రసాద్ బాబు యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్యే జయసూర్యకు వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని మెట్ట భూములకు లిఫ్టుల ద్వారా సాగు నీరు ఇవ్వాలన్నారు. శివపురం, గోకవరం సమీపంలోని లో లేవల్ బ్రిడ్జిలపై హైలెవల్ వంతెనలు నిర్మించాలన్నారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వ సబ్సిడీ బియ్యం, సహకార సంఘం, రైతుభరోసా కేంద్రాలకు, మనగ్రోమర్ సెంటర్ల నందు ఎరువులు, గ్రామాల్లో రైతులకు చెందిన ధాన్యాన్ని లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్న హమాలీలకు విశ్రాంత భవనం లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండలంలో సుమారు 200 మంది నీటి ముంపు నిరుద్యోగులు ఉన్నారని, వారిని ఆదుకోవాలని ఎమ్మెల్యేను కోరారు.

విత్తన శుద్ధితో తెగులు నివారణ

వెలుగోడు: పంటలకు తెగులు సోకకుండా విత్తన శుద్ధి చేసుకోవాలని ఏడీ ఆంజనేయ సూచించారు. మండలంలోని వేల్పనూరు గ్రామంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏడీ పాల్గొని రైతులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ సర్దార్ మియా, వ్యవసాయ విస్తరణ సహాయకులు మహేంద్ర, స్వర్ణలత పాల్గొన్నారు.

వేపనూనె వినియోగించాలి

పాములపాడు: పైరు మొదటి దశ నుంచే వేప సంబంధిత కషాయాలు లేదా వేప నూనె వినియోగించాలని మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఇస్కాల, తుమ్మలూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ రబీలో మినుము సాగు ఎక్కువగా ఉంటుందని చెప్పారు. ఈ పంటకు సోకే లద్దె పురుగు నివారణకు విషపు ఎర తయారు చేసి సాయంకాలం వేలల్లో పొలంలో చల్లాలని సూచించారు. తెల్లదోమ, పచ్చ దోమ నివారణకు పసుపు, నీలం రంగు జిగురు అట్టలను పొలంలో ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. రెక్కల పురుగు ఉనికిని గుర్తించడానికి లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలని సూచించారు. వేరు కుళ్లు తెగుళ్ల నివారణకు ట్రైకో డెర్మవిరిడి తో విత్తన శుద్ధి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో సెరికల్చర్ ఆఫీసర్ ప్రసాదరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు గోవర్ధన్ ఆచారి, రైతులు పాల్గొన్నారు.

పంట బీమా చేయించుకోండి

జూపాడుబంగ్లా: రబీ పంటలు సాగుచేసిన రైతులు ప్రీమియం చెల్లించి పంటలకు బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని తర్తూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఖరీఫ్ ప్రారంభానికి ముందు రైతులు చేయించుకున్న భూసార పరీక్షా ఫలితాల పత్రాలను రైతులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలన్నారు. అధికమోతాదులో రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకం తగ్గించుకోవాలన్నారు. భూసార పరీక్షలు చేయించుకోవటం ద్వారా భూసాంద్రత ఫలితాలను అనుసరించి రైతులు రసాయనిక ఎరువులు వినియోగించుకోవాలన్నారు. సేంద్రీయ ఎరువుల వినియోగంతో పంట దిగుబడులు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ సాగుచేసిన పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. రబీ సీజన్‌లో సాగుచేసిన పంటలను తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవడంతో పాటు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. అనంతరం గ్రామానికి చెందిన పుల్లారెడ్డి అనే రైతు మొక్కజొన్న పొలంలో నిర్ణీత కొలతల్లో పంటకోత ప్రయోగం నిర్వహించగా 16.50కిలోల దిగుబడి వచ్చినట్లు తెలిపారు.

మొక్కజొన్న కంకులు మాయం

నందికొట్కూరు: మండల పరిధిలోని 10 బొల్లవరం గ్రామంలో మొక్కజొన్న కంకుల సంచులు మాయమయ్యాయి. వేల్పుల స్వామన్న అనే రైతు రెండు ఎకరాల్లో మొక్కజొన్న, కందిపంట సాగు చేశాడు. మొక్కజొన్న చేతికి రావడంతో బుధ, గురువారం రెండు రోజులు పాటు కోతకోశాడు. మరుసటి రోజు ఆ కంకులను పొలంలోనే ఎండబెట్టారు. ఆదివారం ఉదయం రైతు చేను వద్దకు వెళ్లి చూడగా మొక్కజొన్న కంకుల సంచులు కనిపించలేదు. గొల్ల రాముడు కొలు పొలంలో సుమారు 12 సంచుల మొక్కజొన్న కంకులు కనిపించడం వలన గ్రామానికి చెందిన కొంత మంది రైతులకు, పోలీసులకు బాధిత రైతు సమాచారం అందించారు. పోలీసులు, దళిత బహుజన ఫ్రంట్ జిల్లా అధ్యక్షురాలు వేల్పుల జ్యోతి గొల్ల రాముడు పొలం వద్దకు చేరుకొని కంకుల సంచులను పరిశీలించారు. ఇవి వేల్పుల స్వామన్నకు చెందినవి అని తేల్చారు. కాగా దొంగతనానికి పాల్పడిన గొల్ల రాముడిపై కఠిన చర్యలు తీసుకోవాలని వేల్పుల జ్యోతి పోలీసులకు డిమాండ్ చేశారు.

మున్సిపాలిటీని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తాం

- మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఆసియా మారూఫ్



మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఆసియా మారూఫ్, సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు

ఆత్మకూరు: మున్సిపాలిటీని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఆసియా మారూఫ్ అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మున్సిపల్ కౌన్సిలర్ల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారిలో వీధి దీపాలు ఏర్పాటు చేయడంతో పట్టణం కొత్త శోభ సంతరించుకుందన్నారు. ఇందిరానగర్, కొత్తపేట, వడ్లపేట, అర్బన్ కాలనీ, వెంగళరెడ్డినగర్, రహ్మత్‌నగర్, వడ్లపేట, వాకిలిపేట, గొల్లపేట, ఏబీఎం పాలెం, ఎస్సీ పాలెంతోపాటు 24 వార్డుల్లోని శివారు కాలనీలలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం 13 అంశాలను లేవనెత్తగా 12 ప్రతిపాదనలను ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, వైస్ ఛైర్మన్ రాజగోపాల్, కోఆప్షన్ సభ్యులు రషీద్, కౌన్సిలర్లు గౌస్, యోనోస్, ప్రకాష్‌రావు, సుల్తాన్, విజయ్‌చౌదరి, విజయ్, పార్వతి పాల్గొన్నారు.

కుమారస్వామికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమార స్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

ఒంగోలు జాతి పశువుల బహిరంగ వేలం

మహానంది: ఎంసీ ఫారం గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర పశు పరిశోధన స్థానంలో మంగళవారం జరిగిన ఒంగోలు జాతి పశువుల వేలంపాటల ద్వారా రూ.8.77లక్షలు ఆదాయం సమకూరినట్లు పశుపరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ధర్మారావు తెలిపారు. గుంటూరు ఎల్‌ఆర్‌ఎస్ ప్రొఫెసర్ డాక్టర్ ముత్తరావు, తిరుపతి యూనివర్సిటీ ఏపీ శేషబాబు, డాక్టర్ సాయికృష్ణ తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించిన వేలాలు పోటాపోటీగా జరిగాయి. 13 ఆవులు, 18 పెయ్యదూడలు, 21 కోడెదూడలకు వేలాలు జరిగినట్లు ధర్మారావు తెలిపారు. వీటిలో 1159 నంబరు కలిగిన ఆవు అత్యధికంగా రూ.52 వేలు ధర పలికిందన్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు

పాములపాడు: మండలంలోని ఇస్కాల గ్రామంలో మంగళవారం ఉపాధి హామీ పథకం కింద పిచ్చి మొక్కల తొలగింపు పనులు చేపట్టారు. ఈ పనులను సర్పంచు మౌలాలి పరిశీలించి మాట్లాడుతూ 3 సంవత్సరాల క్రితం రోడ్డు వెంట మొక్కలు నాటడం జరిగిందన్నారు. ఈ మొక్కల చుట్టూ పిచ్చి మొక్కలు పెరగడంతో వాటిని తొలగిస్తున్నట్లు చెప్పారు. అలాగే కాల్వల్లో పూడిక తీత పనులు చేయిస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి నాగశేషులు, ఫీల్డు అసిస్టెంట్ రమణయ్య ఉన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫుడ్ మేళా

నందికొట్కూరు: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ పి. రవి అధ్యక్షతన మంగళవారం ఫుడ్ మేళా నిర్వహించారు. ఇందులో విద్యార్థినులు పాల్గొని వంటలను రుచికరంగా తయారు చేసి ప్రదర్శించారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు ఇస్తామని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ డాక్టర్ బి. పరిమళాదేవి, మహిళా సాధికారత విభాగం కన్వీనర్ అమరావతి, తలత్ పర్వీన్, డబ్ల్యూసీ సభ్యులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

2 నుంచి కార్తీక ఉత్సవాలు

బండిఆత్మకూరు: నల్లమల అటవీ ప్రాంతంలోని గంగా ఉమా సమేత ఓంకారం పుణ్యక్షేత్రంలో నవంబర్ 2 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు కార్తీక ఉత్సవాలు జరుగుతాయని ఆలయ ఈఓ నాగ ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కార్తీక ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు ఉదయం తెల్లవారుజామున 4.30 నుంచి 9.30 వరకు అభిషేకాలు, ప్రతి సోమవారం గంగా ఉమా సమేత ఓంకారేశ్వరుడికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహిస్తామన్నారు. నవంబర్ 15న కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని సత్యహరిశ్చంద్ర నాటకం ప్రదర్శించనున్నట్లు చెప్పారు.

మహాసభను జయప్రదం చేయండి

ఆత్మకూరురూరల్: నవంబరు 5న ఆత్మకూరులో నిర్వహించనున్న పట్టణ మహాసభను జయప్రదం చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఏ రణధీర్ కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ స్థానిక డాక్టర్ ధనుంజయ సమావేశహాల్‌లో జరగబోయే మూడో పట్టణ మహాసభలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు రామ్‌నాయక్, స్వాములు, సురేంద్ర, నాగేశ్వరరావు, దినేష్ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్



రాష్ట్ర స్థాయి క్రీడల్లో రాణించిన క్రీడాకారులతో ప్రధానోపాధ్యాయుడు మధసూదన్‌రావు

పగిడ్యాల: రాష్ట్ర స్థాయి జూనియర్ విభాగం ఖోఖో పోటీల్లో పాల్గొని రాణించిన క్రీడాకారులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదన్‌రావు, ఉపాధ్యాయులు మంగళవారం ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడుతూ స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదివే విద్యార్థులు గంగాధర్, చరణ్, 7వ తరగతి చదివే భానుప్రియ చిత్తూరు జిల్లా అగదాంపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 25వ తేది నుంచి 27వ తేది వరకు నిర్వహించిన 43వ రాష్ట్ర స్థాయి జూనియర్ విభాగం ఖో ఖో పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి పాఠశాలకు గుర్తింపు తెచ్చారన్నారు. చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమేనని, ఇందులో రాణించే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. క్రీడల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నాయని క్రీడాకారులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేలా శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్, తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు రషీద్, క్రీడాశ్రీ పీతాంబరరెడ్డి తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు



మాట్లాడుతున్న ఆత్మకూరు తహసీల్దార్ రత్నరాధిక

ఆత్మకూరురూరల్: రీ–సర్వే సంబంధిత భూముల సమస్యలను పరిష్కరించేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నామని తసీల్దార్ రత్నరాధిక తెలిపారు. మంగళవారం ముష్టపల్లెలో నిర్వహించిన గ్రామ సభలో ఆమె పాల్గొని అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పట్టాదారు పేరు మార్పు కోసం 3, జాయింట్ ఎల్‌పీఎంల సబ్‌డివిజన్ కోసం 17, విస్తీర్ణం మార్పునకు 33 కలిపి మొత్తం 53 ఫిర్యాదులు అందాయన్నారు. వీటిని వీలైనంత త్వరగా పరిష్కరిస్తామన్నారు. మండల సర్వేయర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే సభలు

మిడుతూరు: రీ సర్వే నిర్వహించిన గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని మాసపేట గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమభూములకు సంబంధించిన సమస్యలను వినతుల రూపంలో అందజేస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతి ఒక్కరూ గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం రైతుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ డీటీ సునీల్ రాజు, మండల సర్వేయరు కృష్ణుడు, వీఆర్వో సంజీవ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోండి

బండిఆత్మకూరు: గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ధోని ఆల్‌ఫ్రెడ్ సూచించారు. మండల పరిధిలోని పరమటూరు గ్రామంలో మంగళవారం నిర్వహించిన గ్రామ సభకు 82 దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ తెలిపారు. పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ఆయుర్వేద మందులతో వ్యాధులు నయం



ఆయుర్వేద వైద్య విధానాలపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నాగరాజు

వెలుగోడు: ఆయుర్వేద మందులతో దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతాయని ఆయుర్వేదం డాక్టర్ నాగరాజు అన్నారు. ఆయుర్వేద వార్షికోత్సవాల సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆయుర్వేద వైద్య విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీపీ, షుగర్, థైరాయిడ్, గ్యాస్ ట్రబుల్ తదితర వ్యాధులకు ఆయుర్వేద మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవిశంకర్ రావు, ఫైజుల్లా, సురేష్ పాల్గొన్నారు.

వీబీకే ఎంపిక



చేతులు ఎత్తి బుక్‌కీపర్‌ను ఎన్నుకుంటున్న పొదుపు మహిళలు

జూపాడుబంగ్లా: మండల కేంద్రం జూపాడుబంగ్లా అరుణోదయ గ్రామైఖ్యసంఘం విలేజ్ బుక్ కీపర్(వీబీకే)ఎంపిక మంగళవారం భారీ పోలీసు బందోబస్తు మధ్య నిర్వహించారు. ఇదివరకు బుక్‌కీపర్‌గా ఉన్న జ్యోతి అనే మహిళ శ్రీనిధి రుణాల చెల్లింపులో అవినీతి, అక్రమాలకు పాల్పడిందని ఆమెను గ్రామైఖ్యసంఘం సభ్యులు తీర్మానం చేసి తొలగించటంతో పాటు పోలీసులకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో అరుణోదయ గ్రామైఖ్యసంఘం నూతన కమిటీతో పాటు బుక్‌కీపర్ ఎంపిక కార్యక్రమాన్ని మండల మహిళాసమాఖ్య కార్యాలయంలో నిర్వహించారు. బుక్‌కీపర్‌గా సుమలతను గ్రామైఖ్యసంఘం సభ్యులు ఎన్నుకున్నట్లు ఏపీఎంలు అంబమ్మ, రమణ తెలిపారు. కాగా తొలగించబడిన బుక్‌కీపర్ జ్యోతి ఏపీఎంతో వాగ్వాదానికి దిగారు. అక్కడే ఉన్న ఎస్‌ఐ లక్ష్మీనారాయణ వారిని మందలించి అక్కడి నుంచి పంపించేశారు.

గ్రామాల్లో బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

జూపాడుబంగ్లా: గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా బెల్ట్‌దుకాణాలు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుటామని నందికొట్కూరు ఎక్సైజ్, ప్రొహిబిషన్ సీఐ రామాంజనేయులు హెచ్చరించారు. మంగళవారం మండలంలోని తరిగోపుల గ్రామంలో బెల్ట్ దుకాణం నిర్వహించి మద్యం విక్రయిస్తున్న మద్దిలేటి ఇంటిపై ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మద్దిలేటి ఇంట్లో నిల్వ ఉంచిన 12 మద్యం సీసాలు స్వాధీనం చేసుకోవటంతో పాటు అతడిని అదుపులోకి తీసుకున్నారు. మద్యం సీజ్‌చేసి నిందితుడిపై కేసునమోదు చేశారు. అనంతరం సీఐ విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నియోజకవర్గంలోని మద్యం దుకాణాల్లో ఎక్కడైనా ఎమ్మార్పీ కంటే అధికానికి మద్యం విక్రయిస్తే మొదటి సారి రూ.5లక్షలు జరిమానా విధిస్తామని, రెండో సారి పట్టుబడితే మద్యం దుకాణం సీజ్‌చేస్తామని హెచ్చరించారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ జఫ్రుల్లా, హెడ్‌కానిస్టేబుల్ శంకర్‌నాయక్, కానిస్టేబుళ్లు సుధీర్, మధుప్రసాద్ పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

పాములపాడు: మండలంలోని వాడాల గ్రామంలో ఎలాంటి అనుమతి లేకుండా అక్రమ మద్యం విక్రయిస్తున్న బాలప్పగారి రామకృష్ణుడును అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ సురేష్‌బాబు మంగళవారం తెలిపారు. అక్రమార్జనకు అలవాటు పడి నిందితుడు ఇంటి వద్దనే మద్యం విక్రయిస్తున్నాడు. ఈమేరకు సమాచారం అందుకున్న ఎస్‌ఐ ఉదయం సిబ్బందితో వెళ్లి ఇంటిలో సోదాలు చేసి 180ఎంఎల్ రాయల్ లారెన్స్ విస్కీ 21 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. నిందితునిపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ చట్టం ప్రకారం కేసు నమోదు చేశామని తెలిపారు.

ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధం కండి

నంద్యాల(న్యూటౌన్): ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు అన్నారు. మంగళవారం నంద్యాల జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన పై నాయకులు మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు. విశాఖ ఉక్కును పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరు పోరాటం చేయాలన్నారు. విద్యుత్ చార్జీల పెంపు తగదన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలన్నారు. టీడీపీ ప్రభుత్వం ఎన్నికల్లో మాయ మాటలు చెప్పి గద్దె ఎక్కిందన్నారు. రైతులు విద్యార్థులకు, మహిళలకు ఇచ్చిన హామీలన్ని వెంటనే నెరవేర్చాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. నవంబర్ 18వ తేదీన గ్రామ, వార్డు సచివాలయాల ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని అన్నారు.

విద్యార్థిని ప్రతిభ

ఆత్మకూరురూరల్: స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాల విద్యార్థిని మౌలాబీ సైక్లింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు హెచ్‌ఎం నాగరాజు తెలిపారు. విద్యార్థినిని మంగళవారం వ్యాయామ ఉపాధ్యాయులు దేవానంద్‌తో కలిసి ఆయన అభినందించారు. ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచి బంగారు పతకం సాధించిందన్నారు. జార్ఖండ్‌లో జరగబోయే పోటీల్లోనూ ప్రతిభ చూపాలని ఆయన ఆకాంక్షించారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

ఆత్మకూరురూరల్: ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు సాధించవచ్చని ఏఓ విష్ణువర్ధన్ రెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని ఇందిరేశ్వరం, పిన్నాపురం పంచాయతీ పరిధిలో మంగళవారం ఏర్పాటు చేసిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు సలహాలు సూచనలు ఇచ్చారు.

అందరి సహకారంతో సమస్యలు పరిష్కరిస్తాం

కొత్తపల్లి:అందరి సహకారంతో ప్రజా సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో గ్రామాల్లోనే ప్రజా సమస్యలకు పరిష్కారం చూపిస్తామన్నారు. ఇందులో భాగంగానే మండలంలోని వివిధ గ్రామాల నుంచి 47 మంది సమస్యలపై దరఖాస్తు చేసుకున్నారని వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపారు. కాగా ఇదే సమావేశంలో జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక ప్రజాప్రతినిధులకు ప్రాధాన్యత ఇవ్వకపో తే ఎలా అని ప్రశ్నించారు. అధికారుల పనితీరు సరిగ్గా లేదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీఓ మేరి, డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, ఏపీఎం పుల్లయ్య, ఏఓ మహేష్, ఎంఈఓలు బ్రహ్మం నాయక్, ఇనాయతుల్లా, పశువైద్యాధికారి భువనేశ్వరి, ఎర్రమఠం, గోకరవం, కొత్తపల్లి ప్రాథమి ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు జబీర్, విజయేంద్ర, దీపానాగవేణి, మహమ్మద్ బేగ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ, ఆయా శాఖల అధికారులు, సర్పంచు చంద్రశేఖర్ యాదవ్, ప్రజలు, రైతులు పాల్గొన్నారు.